# 'ఎవరివి గెలుపు?'

'దయచేసి చిల్లర యివ్వవలెను' అన్న బోర్డు ఒకటి కొత్తగా అయ్యరు 'హోటల్'లో 'కౌంటర్'పైన చోటుచేసుకోవడం మా 'గిరి'గాడికి అసలు నచ్చలేదు.

నిజానికి వాడికీ, చిల్లరకీ అసలు పడదు. వాడి జేబులో నోట్లే తప్ప, కంచుకాగడా పెట్టి వెదకిచూసినా చిల్లరమాత్రం కనబడదు. తప్పనిసరిగా చిల్లర చేతికిస్తే, వాటిని చేతిలోనే వుంచుకొని ఏదోరూపంలో దానిని ఖర్చు చేసేస్తే గాని వాడికి నిద్రపట్టదు. యిలాంటి సకల గుణాభిరాముడైన గిరికి, ఆ 'బోర్డు' అంటే వాడి ఒంట్లో 'ఎనర్జీ' పోయి 'ఎలర్జీ' పట్టుకొన్నదనడంలో ఏమాత్రం సందేహంలేదు.

'రాజూ! ఏమైనా అయ్యరుకి చెప్పి ఆ బోర్డు తీయించేయాలిరా!' అన్నాడు గిరి ఓ రోజున.

'ట్రై చెయ్యి!' అన్నాను నవ్వుతూ.

నాకు తెలుసు అయ్యరు ఒక 'బంకమట్టి' అని. ఏదీ పట్టదు. పడితే వదలదు మరి!

మర్నాడు మళ్ళీ కలిసాడు గిరి.

'రాజూ! ఆ అయ్యరు ఒట్టి మొండి ఘటంరా! వుంచండిసార్! అది మిమ్మల్నేం చేసింది? అని తిరిగి ప్రశ్నించాడురా వాడు నన్ను. దీని సంగతేమిటో తేల్చెయ్యాలిరా నువ్వు. బాబ్బాబు! అని నన్ను బ్రతిమాలసాగాడు గిరి.

'సరేలే! టైమ్ వస్తుంది. ప్రస్తుతం వూరుకో! అంటూ వాడిని సముదాయించాను.

ఆరోజు ఏదో కొత్తసినిమా రిలీజ్ అయ్యింది. అయ్యరు హోటల్ చాలా రద్దీగా వుంది. టైమ్ సాయంత్రం సరిగ్గా 5 గంటలయ్యింది. కౌంటర్ దగ్గర అయ్యరే కూర్చొనివున్నాడు. నేనూ, గిరీ హోటల్లో ఓ ప్రక్కగా కూర్చొనివున్నాం.

యింతలో అయ్యరు ఎవరిమీదనో విసుక్కొంటూ వుండటం కన్పించింది.

'ఏమిటయ్యా! నీ రూపాయిన్నర బిల్లుకు అన్నీ పైసలు యిస్తే నేనెక్కడ లెక్కబెట్టి చచ్చేది? విసుక్కొంటోంది అయ్యరు కంఠం.

'ఏం చెయ్యమంటారు? నాదగ్గర వున్నవన్నీ పైసలే మరి!' ఆ వ్యక్తి సమాధానం.

'ఊ! సరేలే వెళ్ళు!' అయ్యరు విదిలింపు.

ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన వెంటనే వరుసగా మరో నలుగురువ్యక్తులు అదే ప్రకారం చిల్లరపైసలు తీసి వాళ్ళబిల్లుకు సరిబెట్టారనుకొంటాను. అయ్యరు కంఠం తారాస్థాయి నందుకొంది.

'యిదేంటయ్యా! మీరంతా ఏమైనా కలిసి కట్టుకొని దొంగపైసలు ముద్ర కొడ్తున్నారా? రెండురూపాయల బిల్లుకూ అయిదురూపాయల బిల్లుకూకూడా పైసలు తెచ్చినాము గాన గుమ్మరిస్తుంటుంటే నేనెక్కడ లెక్కపెట్టుకు చావనయ్యా? అంటూ ఒగురుస్తోంది అయ్యరు కంఠం.

'మరి మీరేకదండీ! చిల్లర యివ్వవలెను అని బోర్డు పెట్టారూ?' ఆ నలుగురిలోనూ ఓ కంఠం ప్రశ్నించింది.

'బాబూ! బుద్ధి వచ్చింది. ఆ బోర్డు పెట్టడం నాదే తప్పు' యింక మీరు వెళ్ళిరండి! అన్నాడు నీరుగారుస్తూ అయ్యరు. ఆ తర్వాత ఆ చిల్లర బోర్డు యింక కన్పించలేదు.

'ఏమీ ఎరుగనట్లుండి ఎంత నాటకమాడించావురా! రాజూ! అంటూ నాచెయ్యి నొక్కాడు గిరి!

—బచ్చు వీర్రాజు.